

A.S.Murty



# ఆచరణకు రాని అభ్యుదయం

—పి.వి.కరుణాకరన్

కారు షెడ్‌లో పెట్టి బయటకు వచ్చి, రంగన్నను కేకేశాడు శేఖర్.

"తలుపులు వేసెయ్! ఆ వరండా లోంచి కుర్చీ, టేబుల్ తెచ్చి గార్డెన్‌లో వెయ్యి" అని లోపలకు నడిచాడు.

బట్టలు మార్చుకుని బాత్ రూమ్‌కు నడిచాడు. అమ్మ కొద్ది రోజులు అన్నయ్య దగ్గర వుండి వస్తానని మద్రాసు వెళ్ళటంతో, ఇల్లంతా బోసిగా ఉంది.

తన చిన్నప్పట్నుంచీ ఉంటున్న వంట మనిషి శేషమ్మే ఇంటి బాధ్యత అంతా చూస్తోంది కాబట్టి, తను అమ్మ ప్రయాణానికి అడ్డు పెట్టలేదు.

బడలిక తీరేదాకా స్నానం చేసి

బయటకు వచ్చాడు శేఖర్. ఎదు రొచ్చిన శేషమ్మనుంచి కాఫీ కప్పు అందుకుంటూ అడిగాడు- "ఏమైనా లెటర్స్ వచ్చాయా?"

లేదన్నట్లుగా తలూపింది ఆవిడ. కప్పు ఆవిడకిచ్చి బయటకు నడి చాడు శేఖర్. రంగన్న అప్పటికే గుబురుగా పెరిగిన క్రోటన్స్ ప్రక్కగా కుర్చీ, టేబుల్ వేసి వుంచాడు.

ఈజీ ఛైర్‌లో వెనక్కు వాలి, ఆకాశంవంక చూశాడు. సూర్యుడు డ్యూటీ దిగినట్లున్నాడు. చీకటి రాజ్యం చేయడానికి మహోత్సా హంగా తరలివస్తోంది. మొక్క లకు అప్పుడే నీళ్ళు పోశారు కాబోలు- గార్డెన్‌లోంచి అప్పు డప్పుడు వీస్తున్న చల్లటి గాలులు, అదో విధమైన వింత వాసనతో మనసుకు సేద తీరుస్తున్నాయి.

చటుక్కున అతనికి గుర్తొ చ్చింది- తను వస్తూ వస్తూ ఆ వారం కొత్త వార పత్రిక తెచ్చి నట్లు.

రంగన్నను కేకేసి, కార్లో పత్రిక తెమ్మన్నాడు.

తెలుగు కథలు చదువుతూంటే, అతనికి అదో రకమైన తమాషాగా ఉంటుంది. మరీ కొన్ని పత్రికల్లో ఇప్పుడొచ్చే కథలైతే - వాస్తవానికి దూరంగా, చచ్చు ఆదర్శాలను పెన వేసుకుని, రంగుల కలలను పాఠ కుల బుర్రల్లోకి ఇంజెక్ట్ చేస్తున్నా యని అతని అభిప్రాయం.

సమాజంలో కన్పించే కుళ్ళు గాని, ప్రజల్ని కాన్సర్ వ్యాధిలా పట్టుకుని పీడిస్తున్న సమస్యలు గాని, పరిష్కార మార్గాలుగాని- ఇప్పటి కథల్లో మచ్చుకయినా కని పించకపోవటం అతనికి చాలా బాధగా వుంటోంది.

"ఇదిగో బాబూ! పుస్తకం...."

రంగన్న చేతుల్లోంచి పుస్తకం తీసుకుని, పేజీలు తిరగేశాడు శేఖర్. హఠాత్తుగా అతని కళ్ళు ఒక పేజీలో ఆగిపోయాయి.

ఆ పేజీలో ఓ ప్రముఖ రచ యిత్రి రాసిన కథ వుంది. కథ పేరు- "విప్లవం రగిలింది!"

ఆ రచయిత్రి మహిళాలోకపు విప్లవాత్మక రచయిత్రిగా అప్పటికే కీర్తించబడుతోంది.

శేఖర్ కుతూహలంగా ఆ కథంతా చదివాడు. చదివి విపరీ తంగా ఆశ్చర్యపడ్డాడు. ఆ కథలో రచయిత్రి వెలిబుచ్చిన భావాలు అతన్ని కలవరపరిచాయి.

ఈ కథ కూడా ఆవిడ మామూలు విప్లవాత్మక ధోరణికి తగినట్లే ఉందనిపించింది శేఖర్‌కు. ఈజీ

ఛైర్‌లో వెనక్కి వాలి, కళ్ళు మూసుకున్నాడు శేఖర్. ఆ కథ మళ్ళీ అతని మనసులో మెదిలింది.

ఒక భార్యా, భర్త- అన్యోన్య దాంపత్యం. వాళ్ళ ఇంటికి చుట్టం చూపుగా భార్య తరపు ఓ అమ్మాయి వస్తుంది. ఒక బలహీన క్షణంలో భర్త, ఆ అమ్మాయి చెయ్యి పట్టుకుని కొంత రభస చేసాడు. అది భార్యకు తెలుస్తుంది. అంతే! ఆవిడ రెండు రోజులు తీవ్రంగా ఆలోచించి, చివరకు భర్తకు ఒక ఉత్తరం వ్రాసి వెళ్ళిపోతుంది.

స్త్రీలోలత్వం మూర్తీభవించిన వాణ్ణి, భార్యకాకుండా మరొక స్త్రీని ఆశించిన వాణ్ని- తన భర్తగా అంగీకరించటానికి తన మనస్సు ఒప్పుకోవటం లేదని, తానూ గ్రాడ్యుయేట్‌ని కాబట్టి ఎక్కడైనా ఉద్యోగం చేసుకుని బ్రతగ్గలనని, అతన్ని అతని ఖర్మానికి వదిలేసి, దాంపత్యఫలమైన పిల్లాణ్ణి కూడా తీసుకుని వెళ్ళిపోతుంది.

ఇదీ కథ సారాంశం. చివర్లో రచయిత్రి-ప్రతి స్త్రీ కూడా ఇలాగే తనకు జరిగే అన్యాయాలను ప్రతిఘటించాలనీ, స్త్రీలు మిన్నకుండే రోజులు ఏనాడో పోయాయనీ ఉద్ఘోషించింది.

"హలో బాస్! ఏమిటి తీవ్రంగా ఆలోచిస్తున్నావు?"

ఉలిక్కిపడి, కళ్ళు తెరిచి చూసాడు శేఖర్. ఎదురుగా అతని మిత్రుడు వెంకట్రావ్ జేబుల్లో చేతులు పెట్టుకుని, విలాసంగా చూస్తున్నాడు.

"అరెరె! ఎంత సేపయిందిరా వచ్చి? ఏమిటా ముసలి ఫోజులూ నువ్వునూ-తెలుగు సిన్మా హీరోలా? రంగన్నా! కుర్చీ...."

"హహహహా! చివరకు తెలుగు సిన్మా హీరోని చేశావన్న మాట!" అని నవ్వి, రంగన్న తెచ్చివేసిన కుర్చీ ముందుకి లాక్కుని కూర్చుని శేఖర్ ఒళ్ళో ఉన్న పత్రికను తీసి చూశాడు.

"ఏమిట్రోయ్! తెలుగు కథలు చదువుతున్నావా? ఇదెప్పట్నుంచి?" చిత్రంగాప్రశ్నించాడు వెంకట్రావ్.

"సరదాగా చదివేదానికి ఏదయితేనేం గాని-ముందీ కథ చదువు" అని, తాను ఇంతకు ముందు చదివిన కథ తీసిచ్చాడు.

వెంకట్రావ్ తలూపి, రచయిత్రి పేరు చూసి, ఉలిక్కిపడ్డాడు. "ఈవిడ కథా? చూడు బాబూ! నేను ఇది చదవటం అయ్యేటప్పటికి కాఫీ తెప్పించి, పుణ్యం కట్టుకో. ఆ తర్వాత నీ యిష్టం" అన్నాడు.

శేఖర్ నవ్వి, రంగన్నను పిలిచి

కాఫీలు తెమ్మన్నాడు. రంగన్న తిరిగొచ్చేటప్పటికి, వెంకట్రావ్ కథ చదవటం పూర్తి చేసి, పెద్దగా నిట్టూర్చాడు.

"హుఁ! మన రచయిత్రులలో కొంత మంది రాన్రాను తిరుగుబాటు ధోరణిని మరీ కసిగా గుప్పిస్తున్నారు తమ కథల్లో. వీళ్ళు రాసే రాతల వలన ఎందరి జీవితాలు నాశనమౌతున్నాయో ఆలోచించటం లేదు" అని కాఫీ కప్పు అందుకున్నాడు.

కాఫీ కప్పు ప్రక్కన పెట్టి, "అదేమిటి?" అన్నాడు కుతూహలంగా శేఖర్.

"నీకు బోరు కొట్టదు కదా?" కప్పు ప్రక్కన పెట్టి, అనుమానంగా అన్నాడు వెంకట్రావ్.

"ఫర్వాలేదు-చెప్పు?"

"రైట్! ఇక చెప్తా విను. వీళ్ళు-ఎవరు? రచయిత్రులు-ఆడవాళ్ళను ఎట్రాక్ట్ చేయడానికి ఇట్లాంటి అర్థం లేని కొన్ని చచ్చు ఆదర్శాలతో కథలల్లుతారు. అయితే మన సమాజంలో సగటు ఆడదాని పరిస్థితి ఎంతవరకు ఎదిగింది? వీళ్ళు తమ కథల్లో వల్లించే ఆదర్శాలు తమ నిజ జీవితంలో అనుసరిస్తే తమ బ్రతుకులు ఏమవుతాయో? అనే విషయాన్ని వీళ్ళు అసలు ఆలోచిస్తున్నారా అనేది అనుమానమే.

"ఎంతసేపటికీ స్త్రీని సంకెళ్ళలో వేసి నొక్కేస్తున్నారు, స్వేచ్ఛలేదు, సమానత్వం ఇవ్వటం లేదు, పంజరంలో పక్షిలా పెంచుతున్నారు-అని గొంతు చించుకు అరవటం తప్పితే, ఆ గిరి దాటిన ఆడదానికి మన సమాజంలో ఏ పాటి సత్కారం లభిస్తుంది-అనేది ఆలోచించి చావరు..." వెంకట్రావ్ మాట్లాడటం ఆపి, శేఖర్ వంక చూసాడు.

"నువ్వు చెప్పింది నిజమే! అయితే చిన్న సవరణ-రచయిత్రులు మాత్రమే ఇట్లాంటి కథలు రాస్తున్నారంటావా?"

"కాదు-నేను అందర్నీ దృష్టిలో పెట్టుకునే మాట్లాడుతున్నాను. కాకపోతే వీళ్ళలో మెజారిటీ రచయిత్రులదే."

శేఖర్ తలూపాడు. "గుడ్! పోతే మన సమాజంలో స్త్రీ ఇలా ఎన్ని తరాలు మారినా పురుషుడి ముందు బానిసలాగే ఉండాలంటావ్?"

"నో-అట్లా ఉండమని ఎవరూ అనరు. ఎంత ఎడ్యుకేటెడ్ అయినా మన లేడీస్ తమ ఛాందస భావాలు వదులుకోలేక పోతున్నారు. ప్రతి దానికీ భయం-పిరికితనం. సమా

సత్వం కావాలని ఒక ప్రక్క అరుస్తూనే, మరో ప్రక్క బస్సుల్లోను, సినిమాహాళ్ళలోను సపరేట్ సీట్లు కావాలంటున్నారు. నిజానికి లోపం ఆడవాళ్ళలోనే ఉంది. మగవాడు వాళ్ళను హింసిస్తున్నాడు, వాళ్ళ స్వేచ్ఛను హరిస్తున్నాడు అనే వాదాన్నే నేను వ్యతిరేకిస్తాను. ఎక్కడో మరీ అనాగరికపు వాళ్ళ విషయం వొదిలెయ్. కొంత కాకపోతే కొంతైనా మన మోడ్రన్ లేడీస్ పరిస్థితి బాగానే ఉంది. వీళ్ళు ఘోషిస్తున్నంత హీనంగా పరిస్థితి లేదనే నా అభిప్రాయం."

ఎలా ఉంది మన వాదం అన్నట్టుగా చూశాడు వెంకట్రావ్.

నిట్టూర్చాడు శేఖర్. "బాగానే ఉంది. అయితే ఇట్లాంటి కథలు అనవసరమంటావ్?"

"అనవసరమని కాదు-చిన్న చిన్న సమస్యలను వీళ్ళు భూతద్దంలోంచి పట్టి చూపించి, వాటికి సూచిస్తున్న పరిష్కార మార్గాలే నాకు నచ్చటం లేదు. సపోజ్ ఆ కథలో అమ్మాయి మొగుణ్ణి వదిలేసింది. రైట్-రచయిత్రిగారు బాగానే చెప్పారు. మొగుడి తొందరపాటుకు ఆ వెధవకు తగిన శిక్షే విధించింది. తర్వాత ఆ అమ్మాయి గతి ఏమిటి? ఎన్నాళ్ళు బయట ఒంటరిగా గడుపుతుంది? కోర్కెలను చంపేసిందనే అనుకున్నా, భర్తను వొదిలేసిన ఆడదానికి సంఘంలో ఉన్న స్థానమేమిటి?

"రచయిత్రిని అడిగితే సమాజానికి ఎదురీద మంటుంది. ఉద్యోగం చేసుకుని ఆనందంగా ఉండమంటుంది. వాస్తవంలో అది సాధ్యమేనా? అట్లా అనుకుంటే లోపాలు లేని మగ వెధవ ఎవడంట ఈ ప్రపంచంలో? వీళ్ళ పెళ్ళాలందరూ మొగుళ్ళనొదిలేసి రోడ్లకెక్కాల్సిందేనా?" ఆవేశంగా అరిచాడు వెంకట్రావ్.

"అట్లాగని లేదనుకో! అయితే నువ్వు వాడు చేసిన పనిని సమర్థిస్తున్నావా? అదే వాడి భార్య ప్రక్కింటి కుర్రాడితో మాట్లాడితేనే అనుమానంతో వేధించుకు చస్తాడే!"

"నువ్వు చెప్పింది కూడా నిజమే! అట్లాంటి వాళ్ళు కూడా ఉన్నారు మనలో. ఏమయినా మగవాళ్ళ బుద్ధి చంచలం. ముదిరితే నే చెప్పలేను గాని-ఇది ఆడవాళ్ళే నేర్పుగా, ఓర్పుగా సరిదిద్దుకోవల్సిన విషయం. సంసారంలో వచ్చే ప్రతి చిన్న ఒడిదుడుకులకూ తెగతెంపులు చేసుకొని వస్తే, ఈ లోకమంతా వీర వనితలతో నిండి

ఉండేది" అని నుంచున్నాడు వెంకట్రావ్.

"అందుకే నువ్వు భయపడి పెళ్ళి చేసుకోలేదు కదూ?" తనూ లేస్తూ అన్నాడు శేఖర్.

"అట్లా అనకోరే! పెళ్ళంటూ చేసుకుంటే, వైఫ్‌కు సరియైన పొజిషన్ ఇస్తాను. అద్సరే! ఇంకా ఈ ఈ గొడవెందుగ్గాని, ఎల్లుండి శేషాద్రి పార్టీకి వస్తున్నావా?"

"రాక తప్పుతుందా నాయనా! తప్పకుండా వస్తాను."

"బై! పార్టీ రోజు కలుస్తాను మళ్ళీ." స్కూటర్ స్టార్ట్ చేసి హడావిడిగా వెళ్ళిపోయాడు వెంకట్రావ్.

* * *

శేఖర్, శేషాద్రి ఇంటికి వెళ్ళేటప్పటికి పార్టీ మొదలయింది.

పార్టీకి వచ్చిన పెద్దమనుషుల్లో చాలా మంది శేఖర్‌కు పాత పరిచయస్తులే. కొంతమంది తమ భార్యలను కూడా వెంట తెస్తుంటారు.

హడావిడిగా ఉన్న ఆ వాతావరణాన్ని చూస్తూ, తెలిసిన వాళ్ళను విష్ చేస్తూ ఓ ప్రక్క నిలబడ్డాడు శేఖర్.

అలా చూస్తున్న శేఖర్ దృష్టిని ఆకర్షించింది ఓ చక్కటి రూపం. కన్పించిన అందరితోను చాలా చలాకీగా మాటాడుతూ, మెరుపు తీగలా తిరుగుతోంది. వయసు పాతికపైనే ఉంటుందని అంచనా వేసాడు శేఖర్.

బాగా సెక్సీగా అలంకరించుకుని, వంపుసొంపులు కదిలేట్టు నవ్వుతోంది అప్పుడప్పుడు.

కొద్ది సేపు అటే చూసిన శేఖర్ నెమ్మదిగా కదిలి, లోపలకు నడిచాడు. శేషాద్రి లోపల ఎవరితోనో మాట్లాడు తున్నాడు. శేఖర్‌ను చూడగానే చెయ్యి ఊపాడు.

"ఏమిటి__నువ్వు కూడా లేటేనా?" అంటూ దగ్గరకు వచ్చాడు.

కొద్దిసేపు మాట్లాడిన తర్వాత హఠాత్తుగా, "అన్నట్టు మర్చిపోయాను. వెంకట్ అర్జంట్ పని మీద ఊరెళ్ళాడు. నీకు చెప్పమన్నాడు. పోతే నేనో ముఖ్యమైన వ్యక్తిని పరిచయం చేస్తాను-పద" అని ముందుకు కదిలాడు.

బయిట గార్డెన్‌లోకి వచ్చిన తర్వాత, శేఖర్ ఇంతకుముందు చూసిన 'సెక్సీమనిషి' దగ్గరకు తీసుకు వెళ్ళాడు.

ఆ మెరుపు తీగె శేషాద్రిని చూడగానే, "మమల్నందరినీ ఇక్కడ

వదిలేసి, మీరు లోపల ఎంజాయ్ చేస్తున్నారన్నమాట?" అంటూ కోపం నటించింది.

"సారీ! అయినా మీరెక్కడుంటే అక్కడే సరదా! బైదిబై మీట్ మై డియర్ ఫ్రెండ్ శేఖర్ ఏరియా మేనేజర్, ఫాక్ట్ లిమిటెడ్. పోతే ఈవిడ ప్రముఖ రచయిత్రి రజని. నీకు కథల పిచ్చి ఉంది కదత్రా? ఈవిడగారి కథలు చదివే ఉంటావు" మాట్లాడుతున్న వాడల్లా, "హలో హనుమయ్యగారూ!" అంటూ మరో వైపు పరిగెత్తాడు.

శేషాద్రి వెళ్ళిన వైపు చూసి, "ఒక్క నిముషం నిలకడగా ఉండడు కదా! బైదిబై—గ్లాడ్ టు మీట్ యూ! మీ కథలు కొన్ని నేను చదివాను. మీ శైలి బాగుంటుంది" అన్నాడు ఆవిడ కళ్ళల్లోకి చూస్తూ శేఖర్.

"ఈ మాటలు ముఖ ప్రీతికి పరిచయం చేయగానే ప్రతివాళ్ళూ అంటున్నారు లెండి. వాళ్ళకు నా కథల గురించి తెలియక పోయినా! పోనీ నా కథలు మీరేం చదివారో చెప్పండి చూద్దాం?" అంది బాంబు ప్రేల్చినట్లుగా.

శేఖర్ నవ్వాడు.

"మీరు తమాషాగా మాట్లాడ్తారు. మిగతా వాళ్ళ సంగతేమో కాని, నా వైఖరి వేరు" అంటూ రజని లేటెస్ట్ స్టోరీస్ పేర్లు కొన్ని చెప్పాడు.

"చాలా?"

"బస్—మీరు ఖచ్చితమైన మనిషని ఒప్పుకున్నాను" అంది హఠాత్తుగా చేయి పట్టుకుని సున్నితంగా నొక్కుతూ.

ఉలిక్కిపడి చూట్టూ చూసాడు శేఖర్.

ఫక్కున నవ్వింది రజని. "అందుకే మీరు నాకు నచ్చారు! పెళ్ళి చేసుకోమనను లెండి. నాకు ఇదివరకే పెళ్ళయింది."

"మీ మాటలు వింటూంటే మీతో రోజూ మాట్లాడాలని పిస్తోంది. ఎందుకంటె మీలాగే అవి కూడా చాలా స్వీటుగా ఉన్నాయి" అన్నాడు.

"నిజం!" అని అతని కళ్ళల్లోకి చూసి, "మీకంత ఇష్టమైతే రోజూ కాకపోయినా తరుచూ కలుసుకుందాం" అంది చక్రాల్లా కళ్ళు తిప్పుతూ.

"ష్యూర్!"

అలా రజనితో కలిపిన స్నేహాన్ని నెమ్మదిగా షికార్లు, సినిమాలదాకా పెంచాడు శేఖర్.

సినిమాల్లో శృంగార సన్నివేశాలప్పుడు నెమ్మదిగా చెయ్యి

తాకించినా, ప్రతి ఘటన లేక పోవటంతో, ఓ రోజున హోటల్ లోని ఫామ్లీ రూమ్‌లో చటుక్కున ముద్దు పెట్టుకున్నాడు.

రజని నిర్ఘాంతపోయినా, తర్వాత నవ్వి, "యూ నాటీబాయ్! నాకు పెళ్ళయింది తెలుసునా?" అంది కొంటెగా.

"ఏం పెళ్ళయితే? తప్పా?" అన్నాడు శేఖర్.

రజని మాట్లాడలేదు అప్పటికి.

"రేపు సాగర్ ప్రోగ్రాం. నువ్వు కూడా నాతో వస్తున్నావు" అన్నాడు ఓ రోజు శేఖర్.

"ఎందుకు?" అంది రజని.

"హాపీ ట్రిప్! కంపెనీ పనులు కూడా కొన్ని ఉన్నాయి అటువైపు. ఏం? ఇష్టం లేదా నీకు?"

"ఆహఁ! ఇష్టంలేదని కాదు" అని కొద్దిసేపు ఆలోచించి, "సరే-మీ ఇష్టం" అంది.

"ఇన్నాళ్ళనుంచి మనం తిరుగుతున్నాం. మరి మీవారికి మనమీద అనుమానంగా లేదా?" అన్నాడు హఠాత్తుగా శేఖర్.

"ఎందుకు అనుమానం? ఏం తప్పు చేశాం?" అంది రజని.

"లీవిట్. పూరికే అడిగాను."

లాడ్జిలో రూము తీసుకుని, డామ్ చూసొచ్చారు ఇద్దరూ. చలి విపరీతంగా ఉండటంతో త్వర త్వరగా రూముకు వచ్చేశారు.

"రజనీ! ఈ ట్రిప్ ఎందుకు వేసానో తెలుసా?"

రజని అతనివంక ప్రశ్నార్థకంగా చూసింది.

"ఐ వాంట్ యూ రజనీ!"

రజనిలో అత నూహించిన మార్పు లేదు. నెమ్మదిగా బెడ్ మీద కూర్చుని, అతని కళ్ళల్లోకి చూస్తూ, "మరిన్నాళ్ళూ దొంగాటకం ఎందుకాడారు?" అంది.

ఈసారి తెల్లబోవటం శేఖర్ వంతయింది.

అతని తత్తరపాటు చూసి, ఫక్కున నవ్వింది రజని. అంతలోనే అతన్ని తన వైపు లాక్కుంది. శేఖర్ ధైర్యంగా ఆమె మీదకు ఒరిగాడు.

తెల్లగా తెల్లవారిన తర్వాతగాని, శేఖర్‌కు మెలకువ రాలేదు.

ఎదురుగా రజని అప్పటికే స్నానం చేసి, ఏదో పుస్తకం చదువుతోంది. శేఖర్‌ను చూసి నవ్వింది. శేఖర్ లేచి స్నానంచేసి వచ్చి కూర్చున్నాడు.

"రజనీ!" నెమ్మదిగా పిలిచాడు.

ఆమె అతనివంక చూసింది.

"రాత్రి మనం తప్పు చేశాం కదూ?"

రజని అతనివంక మౌనంగా చూస్తూండి పోయింది.

"ఇది తెలిస్తే నీ భర్త నీకు ఏ శిక్ష విధించవచ్చునంటావ్?" ఆమె

వంకే సూటిగా చూస్తూ అన్నాడు.

రజని ఉలిక్కిపడింది. అంతలోనే తీవ్రంగా, "ఏమిటి అదోలా మాట్లాడుతున్నావు? నీ అభిప్రాయమేమిటో సూటిగా చెప్పకూడదూ?" అంది.

"అదే—నువ్వు నీ కథల్లో రాస్తుంటావు గదా- పరాయి ఆడదాని చెయ్యి పట్టుకోగానే మొగుడి శీలం అంతా పోయినట్టూ, అందుకు శిక్షగా వెంటనే వదిలెయ్యాలని భార్య నిశ్చయించినట్లూ. పైగా ఇటీవల నువ్వు రాసిన కథ-దాని పేరేమిటి? 'విప్లవం రగిలింది'లో కూడా అదే థీమ్ కదూ? దాని ప్రకారం మీ ఆయన నిన్ను ఏం చెయ్యవచ్చునా అని ఆలోచిస్తున్నాను...." మాటలాపి ఆమెవంక పరీక్షగా చూసాడు.

కాని శేఖర్ ఊహించిన కలవరపాటు ఆమెలో ఏమాత్రం కన్పించలేదు. కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత, నెమ్మదిగా నవ్వింది రజని.

"మొత్తానికి ఘటికుడివే! చూడు డియర్! ఎవ్వరికీ ఇప్పటివరకూ తెలియని ఓ చక్కటి రహస్యం చెబుతాను విను. పత్రికల్లో పేరు చూసి నేనే అసలు రచయిత్రిని అనుకుంటున్నావ్ కదూ? ఆ అభిప్రాయం మార్చుకో! మా చెల్లెలు గుడ్డిది- ఒకావిడ ఉంది. అది చెప్పే కథలనే నేను ఫెయిర్ చేస్తాను. దాని కిష్టం లేకపోవటం వలన, ఆ కథలన్నిటికీ నా పేరే పెడుతున్నాను. రచయిత్రిగా నేను గుర్తింపు పొందుతున్నాను.

"ఇప్పుడర్థమైందనుకుంటాను-నా కథల్లో ఉండే భావాలు నావి కావని! నాది స్వేచ్ఛా ప్రవృత్తి. కాని ఒకటి మాత్రం నిజం-నిజమైన రచయిత్రి లేక రచయిత తమ కథల్లో ఆదర్శాలు అంటూ చెబితే వాటిని నిజ జీవితంలో తాము పాటించడానికి ప్రయత్నిస్తారని నా విశ్వాసం. పాపం! చాలా శ్రమ పడ్డావ్! నిన్ను చూస్తే జాలేస్తోంది. లే-అలా తిరిగొద్దాం" అంది.

ఆ షాక్ నుంచి తేరుకోటానికి శేఖర్ కు చాలా టైము పట్టింది.

కాని నిజమైన రచయిత్రి తానేననీ, కావాలనే తను అబద్ధం చెప్పిందనీ శేఖర్ కు తెలిస్తే, ఆ షాక్ నుండి శేఖర్ అసలు తేరుకునేవాడు కాదేమో!

ఇతరులకు చెప్పే ఆదర్శాలకూ, తాము ఆచరణలో చూపే ఆశయాలకూ పొంతన అనేది ఉండదని తెలీని అమాయకుడు శేఖర్ మరి! ●